నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 31 ఆగస్టు 2024 | SURYAPET

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 30: 2025-26 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి(జేఎన్‌వీఎస్‌టీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 18, 2025లో ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తులు చేసేలా చూడాలని ఎంఈఓలు, మండల నోడల్ అధికారులకు సూచించారు.

డీఈడీ విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలి

రామగిరి, ఆగస్టు 30: డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈడీ), డిప్లొమో ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం 2023-25 బ్యాచ్ విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజులను సెప్టెంబర్ 12లోగా చెల్లించాలని డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు సైతం చెల్లించేలా అవకాశం ఉందన్నారు. రూ. 50 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 19లోగా ఫీజు చెల్లించాలని సూచించారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు తెలియచేసి ఫీజులను సకాలం చెల్లించి ఆన్‌లైన్ చేయాలని కోరారు.

అన్నదాతకు రుణమాఫీ అవస్థలు

అధికారుల చుట్టూ చక్కర్లు | ఇచ్చిన పత్రాలే మళ్లీ మళ్లీ సమర్పణ

- ఇప్పటికే ఒకసారి దరఖాస్తుల అందజేత
- ఇప్పుడు సర్వే సందర్భంగా మళ్లీ స్వీకరణ
- సెల్ఫీ కోసం కుటుంబం యావత్తు అధికారుల చుట్టూ..
- ప్రస్తుతానికి రేషన్‌కార్డు లేని వారి వరకే సర్వే
- ఇతర కారణాలతో మాఫీ కాని రైతుల వంతు ఎప్పటికో?
- అంతులేని కథలా సాగుతున్న రుణమాఫీ



నల్లగొండ మండలం అప్పాజిపేటలో సర్వేకు హాజరైన రైతులు, వారి కుటుంబ సభ్యులు

కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ పథకం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంతులేని కథలా సాగుతున్నది. రోజుకో కొత్త నిర్ణయం రైతులను పరేషాన్ చేస్తున్నది. లోన్ మాఫీ కావాలంటే తిరుగక ఏం చేస్తారన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని రైతాంగం మండిపడుతున్నది. ఇప్పటివరకు మూడు విడుతల రుణమాఫీ జాబితాల్లో పేర్లు వచ్చిన వారికి మినహా అదనంగా ఒక్క రైతుకు కూడా రుణమాఫీ అయిన దాఖలాలు కనిపించడం లేదు. ఆ పత్రాలు ఇవ్వండి.. ఈ పత్రాలు ఇవ్వండి... అయిపోతుందంటూ మంత్రులు, అధికారులు చెప్పడమే తప్ప పని అయ్యింది లేదని రైతులు వాపోతున్నారు. వాళ్ల మాటలు నమ్మి నెల రోజులుగా రైతులు వ్యవసాయ పనులను వదిలి బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నది. రోజురోజుకో కొత్త డైరెక్షన్‌తో ప్రభుత్వం కూడా అమాయమయానికి గురిచేస్తున్నది. రుణమాఫీ కాని రైతులు వాళ్ల ఆశలు వదులుకునేలా చేస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డు లేని రైతుల సర్వే పేరుతో సాగుతున్న తతంగంపైనా సందేహాలు నెలకొన్నాయి. ప్రభుత్వానికి అందరికీ రుణమాఫీ చేసే చిత్తుశుద్ధి ఉంటే ఇన్ని కొర్రీలు అవసరమా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 6 లక్షల మంది వరకు 2 లక్షల రుణమాఫీకి అర్హులైన రైతులు ఉంటారని అంచనా. కానీ మూడు విడుతల్లో కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం 3.39లక్షల మంది రైతులకే మాఫీ చేసింది. మిగతా రెండున్నర లక్షల మంది రైతులను నిత్యం బ్యాంకుల చుట్టూ... అక్కడి నుంచి అధికారుల చుట్టూ తిప్పుతూనే ఉంది. నేటికి అదనంగా ఒక్క రైతుకు రుణమాఫీ అయిన దాఖాలాలు మాత్రం లేవు. అధికారుల వద్ద అలాంటి వివరాలేవీ లేకపోవడమే ఇందుకు నిదర్శనం. అందరికీ రుణమాఫీ అని ఎన్నికల హామీలో చెప్పి రేషన్ కార్డు ప్రామాణికంగా కుటుంబంలో గరిష్టంగా 2 లక్షల రుణమాఫీ వర్తింప చేశారు. ఇందులో కూడా వివిధ కారణాలతో అర్హులైన వేలాది మంది రైతులను వదిలేశారు. దాంతో రుణమాఫీ కాని రైతులంతా తీవ్ర అయోమయంలో పడ్డారు. కుటుంబం మొత్తం కలిపి రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల్లోనూ మాఫీ కానివారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారికి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్లలో పొరపాట్లు, ఆధార్ కార్డు, లోన్ అకౌంట్ పేర్లు సరిపోలక రుణమాఫీ నిలిచిపోయిందని అధికారులు చెప్తున్నారు. వాటిని సరిచేసేందుకు ఇప్పటికే ఓ దఫా రైతులంతా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, లోన్ అకౌంట్ జిరాక్సులను దరఖాస్తు ఫారమ్‌తో కలిపి అధికారులకు సమర్పించారు. మండల స్థాయిలోనే గాక జిల్లా స్థాయిలోని గ్రీవెన్స్ సెల్‌లోనూ ఫిర్యాదు చేశారు. అలాంటి వారిలో ఎక్కువమంది లక్షన్నర లోపు రుణాలు ఉన్నవారు ఉన్నట్లు అంచనా. వారెవరికీ కొత్తగా రుణమాఫీ అయిన దాఖలాలు లేవు. దాంతో రైతులంతా ప్రభుత్వం కొత్త డైరెక్షన్ ఇచ్చినప్పుడల్లా అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

మిగతా వారి పరిస్థితి ఏంటో!

ప్రస్తుతం రేషన్‌కార్డు లేని వారి వివరాలను మాత్రమే నమోదు చేస్తున్నారు. అర్హులై ఉండి కూడా ఇతర కారణాలతో రుణమాఫీ కాని వారి పరిస్థితి ఏంటనే దానిపై స్పష్టత కొరవడింది. రేషన్ కార్డు సర్వే సందర్భంగా ఇలాంటి రైతులు మళ్లీ ఒకసారి దరఖాస్తులతో వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఎప్పుడు రుణమాఫీ అవుతుందని ప్రశ్నిస్తుంటే తమకు తెలువదన్నదే అధికారుల సమాధానంగా వస్తున్నది. ఇప్పుడైతే రేషన్ కార్డు లేని వాళ్లే రావాలి.. మీకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా డైరెక్షన్ ఇస్తే చూద్దాం అని చెప్తున్నారు. ఇక ఒకే కుటుంబంలో రేషన్ కార్డు ఉండి 2 లక్షలకు పైగా రుణం ఉంటే వాళ్ల పరిస్థితి కూడా గందరగోళంగా మారింది. పైన ఉన్న అదనపు రుణాన్ని చెల్లించాలని చెప్తున్నా అందులోనూ స్పష్టత లేదు. దాంతో రైతులు అదనపు డబ్బును కట్టినా రుణమాఫీ వర్తిస్తుందా, లేదా అన్న సందేహాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు అప్పోసప్పో చేసి డబ్బు చెల్లిస్తున్నా ఎప్పుడు అవుతుందనే దానిపై గ్యారంటీ కనపడడం లేదు. తప్పొప్పులు, ఇతర కారణాలతో రుణమాఫీ నిలిచిపోయిన వారికి సైతం ఎప్పటివరకు మాఫీ కావచ్చన్న దానిపై స్పష్టత లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే ప్రభుత్వం అందరికీ రుణమాఫీ ఇస్తామని ఆశ చూపుతూ రైతులను రోడ్డుమీదికి లాగుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ, జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ బేజారువుతున్న దారుణమైన పరిస్థితులు నెలకొనడం శోచనీయం.

రేషన్‌కార్డు లేని వారి తిప్పలు..



వివిధ కారణాలతో రుణమాఫీ కాని వారందరి సమస్య పరిష్కరించి మాఫీ చేయాల్సిన ప్రభుత్వం ప్రస్తుతానికి రేషన్‌కార్డు లేని వారి కోసం ఓ సర్వే నిర్వహిస్తున్నది. ప్రత్యేకంగా యాప్ రూపొందించి అందులో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తూ కుటుంబ నిర్ధారణ చేపడుతున్నట్లు ప్రకటించింది. అలాంటి రైతులంతా ఇప్పటికే ఓసారి తమ ఆధార్ కార్డులు, బ్యాంకు సేవింగ్ అకౌంట్, లోన్ అకౌంట్, దరఖాస్తు ఫారాలను వ్యవసాయ అధికారులకు అందజేశారు. ఇవన్నీ ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయాల్లో పాత పేపర్లుగా మిగిలిపోయినట్లే! ఇవేవీ తాజా సర్వేకు పనికి రావంటూ ఇంతకు ముందు ఇచ్చిన పత్రాలన్నింటితోపాటు సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ కూడా పెట్టి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తేనే మూడు రోజులుగా జరుగుతున్న సర్వేలో రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. దీనికితోడు రుణం తీసుకున్న రైతుతోపాటు రైతు కుటుంబం మొత్తం అటెండ్ అధికారులు ముందు హాజరై సెల్ఫీ ఫోటో దిగాలని ఆదేశించారు. దాంతో ఇప్పటివరకు రైతు మాత్రమే తిరిగితే.. ఇప్పుడు కుటుంబం కూడా అధికారుల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది. కొన్నిచోట్ల భార్యాభర్తలు వస్తే సెల్ఫీకి అనుమతిస్తున్నారు. మరికొన్ని చోట్ల పిల్లలు, తల్లిదండ్రులు అంతా హాజరు కావల్సిందేనని చెప్తున్నారు. పిల్లలు, తల్లిదండ్రులు ఉండి రాలేదంటే మీ ఇష్టం.. మీమైతే సెల్ఫీ దింపుతాం.. రుణమాఫీ కాకపోతే తర్వాత మమ్మల్ని అనోద్దు అంటూ రైతులను గందరగోళపరుస్తున్న పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. ఇక ఇంటికే వెళ్లి సర్వే చేస్తామని మంత్రులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నా క్లస్టర్లు లేదా గ్రామాల వారీగా సర్వే కొనసాగుతుండడం విశేషం. రేషన్ కార్డు లేని కారణంగా కాని రైతులు నల్లగొండ జిల్లాలో 35 వేలు, సూర్యాపేటలో 21 వేలు, యాదాద్రి భువనగిరిలో 15 వేల మంది రైతులు ఉండగా వారందరి సర్వేకు మరో పక్షం రోజులు పట్టవచ్చని అంచనా. వారి వివరాల సేకరణ అనంతరం ప్రభుత్వం అంగీకరిస్తే రుణమాఫీ అవుతుందని సమాచారం. అప్పటివరకు అంతా అయోమయమే.



భువనగిరిలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, చిత్రంలో మంత్రి పొంగులేటి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఉమ్మడి నల్లగొండను సస్యశ్యామలం చేస్తాం

- చెక్‌డ్యామ్‌ల నుంచి ప్రాజెక్టుల వరకు అన్నీ పూర్తి చేస్తాం
- బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు ఎన్ని నిధులైనా ఇస్తం
- భూసేకరణ బాధ్యతలను ఎమ్మెల్యేలు తీసుకోవాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రెవెన్యూ మంత్రి పొంగులేటితో కలిసి నీటి పారుదల పనులపై సమీక్ష
- ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల హాజరు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తానని, అది తన ధర్మమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చెక్‌డ్యామ్‌లు మొదలుకుని లిఫ్ట్ ఇరిగేషన్లు, ప్రాజెక్టుల వరకు అన్నీ పూర్తి చేస్తామన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటి పారుదల పనులపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. అంతకుముందు అనాజిపురం శివారులోని బునాదిగాని కాల్వను మంత్రి, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. సమీక్షలో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ బునాదిగాని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పూర్తికి ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామన్నారు. బునాదిగాని కాల్వకు రూ.269 కోట్లు, పిల్లాయిపల్లి కాల్వకు రూ.86 కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు రూ.133 కోట్ల అవసరమన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణను ఎమ్మెల్యేలు పూర్తి చేయాలని కోరారు. భూసేకరణ అనంతరం సంవత్సరంలో పనులు పూర్తి చేయొచ్చన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు మూసీ ప్రక్షాళన జరుగుతుందన్నారు. భవిష్యత్తులో భువనగిరి ప్రాంతానికి దేవాదుల నుంచి లక్షల ఎకరాలకు సాగునీళ్లు వస్తాయని, దేవాదుల ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యమిచ్చి రెండేండ్లలో పూర్తి చేస్తామని తెలిపారు.

2026 మార్చి నాటికి దేవాదుల పూర్తి : మంత్రి పొంగులేటి

దేవాదులకు ప్రాజెక్ట్‌కు 16 ఏండ్ల క్రితం సోనియాగాంధీ శంకుస్థాపన చేశారని, 2026 మార్చి నాటికి దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోనియా గాంధీతో ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. దేవాదుల ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. 45 రోజుల్లోపు రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు నిర్మాణానికి శ్రీకారం చుడుతామన్నారు. సమావేశంలో నీటి పారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ హనుమంతు కే జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, అడిషనల్ కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్ పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులు కోరినవివి..

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఆలేరు, భువనగిరి ప్రాంతాలకు సాగునీరు అందించి అభివృద్ధి చేయాలని కోరారు. తపాసుపల్లికి నీరు అందిస్తే రాజపేట సస్యశ్యామలం అవుతుందన్నారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా ఇంకా 20 చెరువులు నింపే అవకాశం ఉందని, ఆ పనులు చేపట్టాలని, యాదగిరిగుట్ట గండి చెరువుకు కూడా నీళ్లు ఇవ్వాలని కోరారు.

- బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలను చివరి వరకు పెంచితే దీర్ఘకాలం ఉపయోగకరంగా ఉంటాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. భూసేకరణ జరిగితేనే ప్రాజెక్టులు ఫలిస్తాయని చెప్పుకొచ్చారు.
- గంగా నది ప్రక్షాళన తరహాలో మూసీని ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. స్వచ్ఛమైన తాగు నీరు కోసం ప్రతి పాఠశాలకు నిధులు కేటాయించాలన్నారు.
- కాల్వల పనులు వెడల్పు చేస్తున్నారని, తద్వారా ఏడింతల నీళ్లు అధికంగా వచ్చే అవకాశం ఉందని, మంచి కాంట్రాక్టర్లను నియమించి పనులను త్వరగా పూర్తి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కోరారు. బస్వాపూర్ 90 శాతం పూర్తి అయిందని, తిమ్మాపూర్, బస్వాపూర్ నిర్వాసితులకు ఆర్‌ఓఆర్ కింద నష్టపరిహారం నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- ఆసిఫ్‌నహర్ కాల్వకు రూ.5 కోట్లు కేటాయించాలని, ఎస్సారెస్పీకి కాల్వలకు నీళ్లు వదిలి చెరువులు నింపాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు.
- బస్వాపూర్ ద్వారా ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొస్తే రైతులకు న్యాయం చేసిన వారమవుతామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మూసీ జరుగుతున్న నష్టాన్ని నివారించాలన్నారు.
- నాలుగు మండలాలకు సాగునీరు అందించే శివన్నగూడెం ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు.
- పానగల్లు నుంచి ఐటిపాములకు నీళ్లు వస్తే చెరువులు నింపవచ్చని, కాబట్టి సాగు నీరు విడుదల చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు.
- ధర్మసాగర్ నుంచి గండిరామారం లిఫ్ట్ పనులు చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. దీని ద్వారా 90 వేల ఎకరాలకు నీళ్లు వస్తాయని, రూ.207 కోట్లతో పనులు చేయవచ్చని చెప్పారు. 500 చెరువులను కూడా నింపవచ్చని, నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మీరే మాట్లాడేట్లు అయితే.. రైతులను ఎందుకు పిలిచిండ్రు?

- మంత్రుల సమావేశంలో రైతు యాదిరెడ్డి ఆగ్రహం

మాట్లాడుతున్న రైతు యాదిరెడ్డి

'మీరే మాట్లాడ్తరా! ఎంతసేపు మాట్లాడ్తరు? అంతదానికి మమ్మల్ని ఎందుకు పిలిచిండ్రు. మా అభిప్రాయాలు తీసుకోకుంటే ఎందుకు రమ్మన్నరు?' అని మోత్కూరుకు చెందిన రైతు పైళ్ల యాదిరెడ్డి మంత్రుల సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తుండడంతో మధ్యలో రైతు యాదిరెడ్డి జోక్యం చేసుకొని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాంతో తుంగతుర్తి ఎమ్మెల్యే స్పందిస్తూ మాట్లాడొద్దు.. కూర్చోవాలంటూ గదిమాయించే ప్రయత్నం చేశారు. పోలీసులు సైతం ఆయన దగ్గరికి వచ్చి సముదాయించారు. చివరలో మాట్లాడేందుకు ఆయనకు అవకాశం కల్పించారు. 'బునాదిగాని కాల్వ భూసేకరణకు రైతులు భూమి ఇస్తరో, లేదో అని.. ఎకరాకు 30-40లక్షలు అంటున్రు. అవసరం లేదు. మేమే ఎకరానికి వెయ్యి ఇస్తం. నీళ్లొచ్చే ఉపాయం చెయ్యండి. ఏడు మండలాలు ఉన్నాయి. మండలానికో జేసీబీ ఇచ్చి కాలువ తవ్వండ్రి. గంతే నేను చెప్పేది' అంటూ యాదిరెడ్డి తన అభిప్రాయం తెలిపారు.

తిరుమలగిరి మార్కెట్‌కు 1,788 క్వింటాళ్ల పెసర్లు



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పెసర్లు

తిరుమలగిరి, ఆగస్టు 30 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల నుంచి పెసర్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ నెల 28 నుంచి పెసర్ల రాక ప్రారంభం కాగా 1,788 క్వింటాళ్లు వచ్చాయి. ప్రారంభంలో క్వింటాకు రూ. 8,029 ధర రాగా గురువారం రికార్డు స్థాయిలో క్వింటా రూ.8,500 పలికింది. సీజన్ ఇప్పుడే ప్రారంభం కావడంతో ఇక ముందు మరింతగా పెసర్ల మార్కెట్‌కు పోటెత్తే అవకాశం ఉందని మార్కెట్ సెక్రటరీ శ్రీధర్ తెలిపారు.

సూర్యాపేట మార్కెట్‌కు 513 క్వింటాళ్లు

బొడ్రాయిబజార్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు వారం రోజులుగా పెసర్లు వస్తుండగా శుక్రవారం 132మంది రైతులు 513 క్వింటాళ్ల పెసర్లు తీసుకొచ్చారు. మార్కెట్‌లో క్వింటా పెసర రూ 8,299 ధర పలికింది. అలాగే ఇద్దరు రైతులు తీసుకొచ్చిన రెండు క్వింటాళ్ల కంది క్వింటాకు రూ. 7,695 ధర పలికింది. పెసర్లకు అధిక ధర రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ సెక్రటరీ రాహుల్ ఎప్పటికప్పుడు ధాన్యం నాణ్యతను పరిశీలిస్తూ మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

ల్యాబ్ రియాక్టర్‌లో గ్యాస్ లీకేజీ

- తప్పిన పెనుప్రమాదం
- గుండ్రాంపల్లిలో కమ్ముకున్న పొగలు

గ్యాస్ లీకేజీతో కంపెనీలో నల్లగా మారిన గోడలు

చిట్యాల, ఆగస్టు 30 : చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ హైవేను శుక్రవారం ఉదయం ఒక్కసారిగా దట్టమైన పొగలు కమ్మేశాయి. ఏం జరిగిందో తెలియని భయానక పరిస్థితి. పక్కనే శ్రీపతి ల్యాబ్ నుంచి ఆ పొగలు కమ్ముకొస్తున్నాయి. కంపెనీలో రియాక్టర్ పేలిందని, రియాక్టర్‌లో గ్యాస్ లీక్ అయ్యిందని, రసాయన డ్రమ్ముల ద్వారా ప్రమాదం జరిగిందని నానా రకాల ప్రచారాలు జరిగాయి. కంపెనీలో పని చేసే కార్మికులు భయంతో పరుగులు తీయడంతోపాటు స్థానికులు కూడా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో గల శ్రీపతి ల్యాబ్‌లోని క్యూ 3లో శుక్రవారం ఉదయం 9 గంటల తర్వాత అకస్మాత్తుగా మంటలు లేచి పొగ కమ్ముకుంది. కెమికల్ కంపెనీ కావడంతో సమీపంలోని గ్రామ ప్రజలు భయపడ్డారు. చిట్యాల పోలీసులు కంపెనీ వద్దకు చేరుకొని రామన్నపేట, చౌటుప్పల్ నుంచి అగ్నిమాపక వాహనాలను పిలిపించి రక్షణ చర్యలకు పూనుకున్నారు. రియాక్టర్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా పొగలు వ్యాపించినట్లు తెలుస్తున్నప్పటికీ, ఘటన ఎలా జరిగిందనే దానిపై స్పష్టత లేదు. పోలీసులు మాత్రం తమకు ఫిర్యాదు అందలేదని చెప్తున్నారు.

కంపెనీ ప్రతినిధులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. కాగా, కంపెనీలో పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ ముగ్గురికి స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తున్నది.

ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రేపటి వరకు ఓటరు జాబితా మెర్జింగ్, మ్యాపింగ్ పూర్తి చేయాలి
- గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలు పెంచాలి
- నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 30 : అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని, వచ్చే వారం నాటికి ప్రతి మున్సిపల్ కమిషనర్ కనీసం 50 దరఖాస్తులైనా పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై ఆ శాఖల జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితా మెర్జింగ్, మ్యాపింగ్‌పై సమీక్షిస్తూ ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని సెప్టెంబర్ నాటికి పోల్ పోర్టల్‌లో మెర్జింగ్, మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 3 వరకు మ్యానువల్ పరిశీలన అవ్వాలన్నారు. సెప్టెంబర్ 4 నుంచి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందని, 4 నుంచి 10 వరకు ఎంపీడీఓలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని సౌకర్యాలు ఉన్నదీ లేనిది తనిఖీ చేయాలన్నారు. 15 నాటికి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను సర్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షిస్తూ జిల్లాలో వైరల్ ఫీవర్స్‌తోపాటు డెంగ్యూ వంటి కేసులు నమోదవుతున్నాయని, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో గడ్డి మొక్కలు తొలగించే యంత్రాలు, ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని చెప్పారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నదీ, లేనిది నిర్ధారణ చేసుకుని అప్రమత్తం చేయాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు అవసరమైతే మళ్లీ జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడుకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. వచ్చే మంగళవారం నుంచి శానిటేషన్, ప్లాంటేషన్‌పై ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తాయని తెలిపారు. ఎక్కడైనా పారిశుధ్య లోపం కనపడినా, మొక్కలు లేకపోయినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీపీఓ మురళి, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇరిగేషన్ ఏఈలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ ప్రజల విశేష ఆదరణ పొందిన ప్రముఖ దిన పత్రిక 'నమస్తే తెలంగాణ' లో పనిచేయుటకు విలేకరులు కావలెను. సామాజిక స్పృహ, అంకితభావంతోపాటు తెలుగు భాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపట్ల అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో రాత పరీక్షకు హాజరు కాగలరు. జర్నలిజంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
పరీక్ష తేది :
31-8-2024, శనివారం, ఉ॥ 11 గంటల నుంచి 12 గంటల వరకు
స్థలం : నమస్తే తెలంగాణ టౌన్ ఆఫీస్,
L.P.T.మార్కెట్, 1st Floor, Hyd Road. నల్లగొండ
పని చేయవలసిన డేట్‌లైన్లు
నల్లగొండ జిల్లా: దేవరకొండ, చండూరు, వేములపల్లి
యాదాద్రి భువనగిరి జిల్లా : భువనగిరి సిటీ, ఆలేరు టౌన్
సూర్యాపేట జిల్లా : ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, నాగారం, గరిడేపల్లి, తుంగతుర్తి
వివరాలకు : 91827 77972